సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ׀ 18 ׀ ఏప్రిల్ ׀ 2023

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త



ఏప్రిల్‌లోనే భానుడు భగ్గుమంటుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. 8లో▸



అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోలీసుల అదుపులో నలుగురు నిందితులు, పరారీలో ఇద్దరు ఉన్నారని తెలిపారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

పాలిసెట్ దరఖాస్తు గడువు ఈనెల 24 వరకు

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే పాలిసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 24 తుది గడువని ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ ప్రకటనలో తెలిపారు. మే 17న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పాలిసెట్–2023కు సంబంధించి పూర్తి వివరాలు polycet. sbtet. telangana. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీకాంత్, శ్రీధర్, సుభాష్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

'స్పాట్'ను సందర్శించిన ఆర్జేడీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పదో తరగతి స్పాట్ కేంద్రాన్ని ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి సోమవారం సందర్శించారు. మూల్యాంకన ప్రక్రియను పరిశీలించారు. డీఈవో ప్రణీతతో మాట్లాడి స్పాట్‌కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఆరా తీశారు. జిల్లాకు 1.64లక్షల జవాబు పత్రాలు వచ్చాయని ఇప్పటివరకు 90వేల పత్రాల మూల్యాంకనం పూర్తయినట్లు వివరించారు. ఆయన వెంట ఏడీ నర్సింలు, ఏసీ వేణుగోపాల్ రెడ్డి తదితరులున్నారు.

పోలీసుల దృష్టిలో అందరూ సమానమే..

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు వ్యవస్థ అందరినీ ఒకే దృష్టితో చూస్తుందని జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ జిల్లా పోలీసు వ్యవస్థతో పాటు జిల్లా పోలీసులపై నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా పోలీసు వ్యవస్థ అన్ని వర్గాలు, పార్టీలను ఒకే రకంగా చూస్తుందని తెలిపారు. సమన్యాయ పాలనను జిల్లా ప్రజలకు నిరంతరం అందిస్తూ శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రతిక్షణం పోలీసులు విధులు నిర్వరిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసులకు కులాలు చుట్టరికాలు అంటగడుతూ అభియోగాలు మోపడం సరికాదని తెలిపారు. గతంలో పాయల్ శంకర్ ఓ మహిళా పోలీసు అధికారిపై అసభ్యకర పదజాలంతో దూషించి మహిళల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించారని గుర్తు చేశారు. శంకర్ వ్యక్తిగత ద్వేషాన్ని మనసులో ఉంచుకొని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా పోలీసుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ రాకేశ్

ఆదిలాబాద్: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. హన్మకొండలో నిర్వహించిన 20వ జూనియర్ అథ్లెటిక్స్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్కే ముస్కాన్ హ్యామర్ త్రోలో, ప్రియాంక హై జంప్‌లో రజత పతకాలు సాధించారు. వీరిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేష్, పెటా ప్రెసిడెంట్ పార్థసారథి, ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి అభినందించారు. క్రీడాకారులతో కోచ్ వీజీఎస్ రాకేశ్ తదితరులున్నారు.



అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల కోసం కాన్పమేడిగూడలో స్థలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్, కేవీకే సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్

అగ్రి ముందడుగేది?

- వచ్చే అకడమిక్ ఇయర్ నుంచే తరగతులు
- ఇంకా తేలని స్థల సేకరణ
- మొదట అద్దె భవనంలో నిర్వహణకు యోచన

సాక్షి, ఆదిలాబాద్: వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ వర్సిటీకి అనుబంధంగా ఈ కోర్సును షురూ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడివరకు ఓకే.. అయితే నాలుగున్నరేళ్ల క్రితం ఈ కళాశాల మంజూరు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించినా వసతుల కల్పనలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం. ప్రధానంగా ఈ కళాశాలకు వందెకరాల స్థలం కావాలి. మొదట జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉండే బట్టిసావర్గాంలో ఈ స్థలం కేటాయిస్తామని చెప్పారు. అక్కడ ఒకే చోట అంత స్థలం కుదరదని ఆ తర్వాత సాత్నాలకు సమీపంగా ఉండే గ్రామాల్లోని భూమిని ఒకేదగ్గర కేటాయిస్తామని చెప్పి ఏడాది గడిచినా ఇప్పటికీ ముందడుగు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మొదట అద్దె భవనంలో దీన్ని ప్రారంభించే పరిస్థితి ఉంది. ఆ తర్వాత స్థలం కేటాయించి సొంత భవనంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన కోసం వ్యవసాయ క్షేత్రాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇదంతా జరగడానికి కొన్నేళ్లు పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు ఈ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలన అంతంత మాత్రంగానే జరిగే పరిస్థితి.

ఏళ్లు గడుస్తున్నా..

సీఎం కేసీఆర్ నాలుగేళ్ల క్రితం కొరటా–చనాఖా బ్యారేజ్ పరిశీలన కోసం జిల్లాకు వచ్చారు. ఈ బ్యారేజీ పరిశీలన అనంతరం జిల్లాకేంద్రంలోని డైట్ మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో సీఎం జిల్లాపై అనేక వరాలు కురిపించారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న కోరిక మేరకు అదే వేదిక మీదుగా జిల్లాకు అగ్రికల్చర్ కళాశాల మంజూరుకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఇదంతా 2018–19 మధ్యలో జరిగాయి. ఇక కళాశాల ప్రారంభించడమే తరువాయి అని అందరు అనుకున్నారు. తాత్కాలిక భవనంలోనైనా దీన్ని ప్రారంభించి ఆ తర్వాత స్థల కేటాయింపు, భవన నిర్మాణం, తదితర అంశాలు చేపడతారని అందరు భావించారు.

ఇప్పుడైనా కొలిక్కి వచ్చేనా..

ఈ కళాశాల ఏర్పాటుకు వందెకరాల స్థలం అవసరం. ఇది ప్రస్తుతం ఒకేచోట దొరకని పరిస్థితి. అప్పట్లో మావల గ్రామపంచాయతీ పరిధిలోని బట్టిసావర్గాంలో 39 ఎకరాలు, ఆదిలాబాద్‌అర్బన్ మండలంలోని బంగారుగూడలో 36 ఎకరాలు దీనికోసం వేర్వేరుగా కేటాయించారు. వర్సిటీ అధికారులు ఈ ప్రక్రియ పరిశీలించేందుకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానానికి అప్పగించారు. ఈ స్థలాలను పరిశీలించిన వారు రెండు ప్రాంతాల్లోని 75 ఎకరాలకు ఓకే చెప్పారు. మిగతా భూమి కేటాయింపు కోసం ఎదురుచూశారు. ఇంతలో బట్టిసావర్గాంలో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం దీనికోసం కేటాయించిన భూమిని మళ్లించారు. ఇక బంగారుగూడలో కేటాయించిన భూమి కొంత వివాదాస్పదంగా ఉండడంతో రెండు చోట్ల స్థలాలకు సంబంధించి అగ్రికల్చర్ కళాశాలకు దక్కని పరిస్థితి. ఆ తర్వాత సాత్నాల వద్ద కాన్పమేడిగూడ, మాంగుర్లలో సమీప సర్వే నంబర్లలో వంద ఎకరాల భూమిని దీనికోసం పరిశీలన చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ భూమి విషయంలో కొలిక్కి వస్తుందా.. లేదా అనేది తేలాల్సి ఉంది.

రాష్ట్రంలో ఏడవది..

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ హెడ్‌క్వార్టర్‌గా పనిచేస్తుంది. ఈ యూనివర్సిటీ కింద రాష్ట్రంలో ప్రస్తుతం 6 వ్యవసాయ కళాశాలలు రాజేంద్రనగర్, జగిత్యాల, అశ్వరావుపేట, పాలెం, సిరిసిల్ల, వరంగల్‌లో ఉన్నాయి. ఏడోది ఆదిలాబాద్‌లో ఏర్పాటవుతుందని ఏళ్లుగా చెబుతున్నారు. అయితే వర్సిటీ నుంచి ప్రవేశాలకు సంబంధించి ఆదిలాబాద్ కాలేజీ ప్రస్తావన లేకుండానే మిగతా కాలేజీలకు మాత్రమే అడ్మిషన్స్ కేటాయింపుతో ప్రక్రియ ముగిసిపోతూ వచ్చింది. ఈక్రమంలో వచ్చే ఏడాది ఆదిలాబాద్‌కు ప్రవేశాలు కల్పించనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

అంత స్థలం ఎందుకు..

ఆదిలాబాద్‌కు మంజూరైన కళాశాలలో వ్యవసాయ వృత్తి విద్యకు సంబంధించి నాలుగేళ్ల గ్రాడ్యుయేషన్ కోర్సు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేస్తూ వర్సిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీలకు విద్యార్థులను కేటాయిస్తారు. వసతిగృహం, కళాశాల తరగతి గదులు, గ్రంథాలయం, తదితరాలు నిర్మించాల్సి ఉంటుంది. అయితే ఈ కోర్సులో భాగంగా ప్రధానంగా క్షేత్ర పరిశీలనలోనే విద్యార్థులు ఆరితేరే పరిస్థితులు ఉంటాయి. దీంతోనే ఒకేచోట వందెకరాల్లో దీన్ని ఏర్పాటు చేస్తే విద్యార్థులకు కళాశాల తరగతి గదులతో పాటు క్షేత్రస్థాయిలో సాగుకు సంబంధించి పూర్తిస్థాయి అన్ని అంశాలను నేర్చుకునేందుకు దోహద పడుతుంది. అంతేకాకుండా ఒకసారి గ్రాడ్యుయేషన్ కోర్సు మొదలైన తర్వాత ఇక్కడ ప్రవేశాలకు ఆసక్తి అధికంగా కనబర్చిన పక్షంలో మున్ముందు పోస్టు గ్రాడ్యుయేషన్ కూడా మంజూరయ్యే పరిస్థితి ఉంటుంది. భూమి కేటాయింపు విషయంలో ఆదిలాబాద్ ఆర్డీఓ రమేశ్ రాథోడ్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

66 పోస్టులు మంజూరు



అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల కోసం బోధన, బోధనేతర కలిపి 66 పోస్టులు మంజూరయ్యాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా ఇది కొనసాగుతుంది. త్వరలో అక్కడి నుంచి ఓ కమిటీ జిల్లాకు రానుంది. ఆ తర్వాత తరగతుల నిర్వహణ కోసం అద్దె భవనమా.. మరేమిటన్నది నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. – శ్రీధర్ చౌహాన్, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్

భగభగ.. మండే



నిర్మానుష్యంగా మారిన పట్టణంలోని రిమ్స్ ఎదుట గల పాత జాతీయ రహదారి

- జిల్లాలో సూర్య ప్రతాపం
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం
- దాహార్తితో అల్లాడుతున్న మూగజీవాలు



ఎండకు స్కార్ఫ్‌లు ధరించి వెళ్తున్న యువతులు

ఆదిలాబాద్‌టౌన్: భానుడు భగభగ మండిపోడుతున్నాడు. ఎండ తీవ్రత తట్టుకోలేక జనం అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. జిల్లాలో రెండు, మూడు రోజులుగా రికార్డు స్థాయి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే 43.3 డిగ్రీల సెల్సియస్ మార్కు దాటింది. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతతో జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం కిటకిటలాడే బస్టాండ్, రైల్వేస్టేషన్, తెలంగాణచౌక్, అంబేద్కర్, గాంధీచౌక్ ప్రాంతాలు జనాల్లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. చిరు వ్యాపారులు, ఉపాధి, భవన నిర్మాణరంగ, దినసరి కూలీలు ఎండతీవ్రతతో ఇబ్బందులకు గురవుతున్నారు. మరో రెండు రోజుల పాటు భానుడు ఉగ్రరూపం దాల్చనున్నట్లు అధికారులు చెబుతుండటం మరింత గుబులు రేపుతోంది.

పెరిగిన ఏసీ, కూలర్ల వినియోగం

ఎండ వేడిమి తట్టుకోలేక జనం కూలర్లు, ఏసీలకు అతుక్కుపోతున్నారు. మధ్యాహ్న సమయంలో తప్పనిసరి బయటకు వెళ్లేవారు శీతలపానియాలు, కొబ్బరి బొండాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు ఉంటాయి. వర్షాకాలంలో ఎక్కువ వర్షాలు కురిస్తే, చలి కాలంలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతాయి. అలాగే వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. దీంతో జిల్లా వాసులు మూడు కాలాలూ అప్రమత్తంగా ఉండాల్సిందే.

జిల్లాలో గడిచిన వారం రోజుల ఉష్ణోగ్రత వివరాలు..

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
10	24.7	41.8
11	24.7	41.8
12	24.7	42.0
13	24.7	42.0
14	24.7	43.3
15	24.0	42.0
16	21.4	37.8
17	23.5	41.3

అల్లాడుతున్న మూగజీవాలు..

ఎండ తీవ్రతతో ఇప్పటికే జిల్లాలో పలు వాగులు, చెరువులు ఎండిపోయాయి. దీంతో మూగజీవాలు దాహం తీర్చుకోవడానికి అల్లాడుతున్నాయి. జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో నీటి తొట్టిలు ఉన్నా అవి నిరుపయోగంగా మారాయి. పలు స్వచ్ఛంద సంస్థలు అక్కడక్కడా తొట్టిలు ఏర్పాటు చేసి నీరు అందిస్తున్నారు. కానీ పూర్తిస్థాయిలో అందడం లేదు. అటవీ ప్రాంతంలో గతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో గుంతలు తవ్వి నీటి సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అటవీ జంతువులు, మూగజీవాలకు అవస్థలు తప్పడం లేదు.

జాగ్రత్తలు పాటించాలి



జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలి. వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. రోజుకు కనీసం 5 లీటర్ల నీటిని తాగడం మంచిది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగాలి. వేడి ప్రదేశాల వద్ద పనిచేసే వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. – డా.శ్రీధర్, వైద్యాధికారి

పట్టణ బంద్ ప్రశాంతం



ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులు

- జిల్లా కేంద్రంలో బీజేపీ ర్యాలీ
- భారీగా పోలీసుల మోహరింపు, నాయకుల అరెస్ట్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో అంబేద్కర్ జయంతి రోజున శివాజీ జెండా ప్రదర్శించిన యువకుడిపై పలువురు దాడి చేయగా, వారిని అరెస్టు చేయాలని హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో తమపైనే కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ బంద్‌కు పిలుపునిచ్చాయి. పట్టణ వ్యాప్తంగా చేపట్టిన ఈ బంద్ ప్రశాంతంగా ముగిసింది. పలు ప్రధాన కూడళ్లలో దుకాణదారులు స్వచ్ఛందంగా షాపులను మూసి ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రధాన కూడళ్లలో పోలీసులను భారీగా మోహరించారు. మరోవైపు హిందూ సంఘాలు, బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. బంద్‌కు మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్ కూడలిలో ర్యాలీ నిర్వహించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. శంకర్‌ను అరెస్టు చేయడానికి యత్నించగా కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువురు మధ్య తోపులాట చోటు చేసుకుంది. కాసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పోలీసులు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు వత్తాసు పలుకుతూ బాధితులపైనే కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతోనే హిందువులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టణ బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకులు దినేష్ మటోలియా, మహేందర్, లాలామున్నా, కృష్ణ యాదవ్, రాజేష్, జ్యోతిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, అస్తక్ సుభాష్, రాకేష్, రమేష్, రఘుపతి, విజయ్ తదితరులున్నారు.



పాయల్ శంకర్‌ను అరెస్ట్ చేసే క్రమంలో పోలీసులు, నాయకుల మధ్య తోపులాట

'ప్రజావాణి'పై పట్టింపేది?

- పలువురు జిల్లాస్థాయి అధికారుల గైర్హాజరు
- కొంతమంది మధ్యలోనే వెళ్లిపోయిన వైనం
- అధికారుల తీరుపై బాధితుల అసంతృప్తి



అర్జీలు స్వీకరిస్తున్న ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ



జిల్లాస్థాయి అధికారులు రాక కుర్చీలు ఖాళీగా ఇలా

కైలాస్‌నగర్: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులంతా విధిగా హాజరుకావాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇప్పటికే ఆదేశించారు. అయినా పలువురు జిల్లాస్థాయి అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. కలెక్టర్ సెలవులో ఉండటంతో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి పలువురు జిల్లా స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. డీఆర్డీవో, డీఈవో, డీఎంహెచ్‌వో, డీఎస్సీడీవో, డీసీవో, డీఎస్‌వో, డీఏవో, డీఎం సివిల్ సప్లై, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఈఈలు, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, రిమ్స్ డైరెక్టర్, డీటీడీవో, ఎక్సైజ్ సూపరింటిండెట్ తదితర శాఖల అధికారులు గైర్హాజరైన వారిలో ఉన్నారు. వారి తరఫున సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులను పంపించారు. కలెక్టర్ గైర్హాజరుతో కొంతమంది గ్రీవెన్స్ నడుస్తుండగానే మధ్యలోనే వెళ్లిపోవడం కనిపించింది. కాగా బాధితులు సమర్పించిన అర్జీలను ట్రెయినీ కలెక్టర్ శ్రీజ స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులను పిలువగా కిందిస్థాయి ఉద్యోగులే వచ్చి వాటిని తీసుకోవడంపై బాధితుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డబ్బులు ఇప్పించాలనీ వినతి

ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రీమియం చెల్లించిన రైతులకు ఇన్సూరెన్స్ ఇప్పించాలని బీఆర్ఎస్ నాయకులు, రైతు సంఘం నేత బి. గోవర్ధన్‌రెడ్డి కోరారు. సోమవారం పలువురు రైతులతో కలిసి జిల్లా ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజకు వినతిపత్రం అందజేశారు. వారివెంట నాయకులు కరుణాకర్ రెడ్డి, భూమారెడ్డి తదితరులున్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల ఆందోళన

కైలాస్‌నగర్: తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు సోమవారం ఆందోళనకు దిగారు. కలెక్టర్, డీఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వీవోఏలు తొలుత సుందరయ్యభవన్‌లో సమావేశమయ్యారు. అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజేష్, దత్తు, శ్యాంరావు, భూపతి రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ వీవోఏలు

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కైలాస్‌నగర్: ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొలాం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమితి నాయకుడు సోనే రావ్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి శివారులోని సర్వే నంబర్ 20లో సాగు చేస్తున్న రైతులకు డిజిటల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. అంతరించిపోతున్న ఆదివాసీ కులవృత్తులను కాపాడాలన్నారు. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తు ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్ శ్రీజను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్ఐటీలో ముగ్గురికి కరోనా

భైంసా: బాసర ట్రిపుల్ఐటీలో ముగ్గురు సిబ్బందికి కరోనా పాజిటివ్ వచ్చింది. అక్కడ పనిచేసే సిబ్బందిలో లక్షణాలు కనిపించడంతో సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి కరోనా సోకినట్లు తెలియడంతో అక్కడివారు అప్రమత్తమయ్యారు.

అమ్మవారి సన్నిధిలో దైవజ్ఞశర్మ


పూజలు చేస్తున్న దైవజ్ఞశర్మ

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో దర్శించుకున్నట్లు పేర్కొన్నారు.

ఆల్ పెన్షనర్స్ రాష్ట్ర కమిటీలో శశికాంత్‌కు చోటు


శశికాంత్

ఆదిలాబాద్అర్బన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.శశికాంత్ చోటు లభించింది. ఈనెల 15, 16న రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞా న భవన్‌లో సంఘం ఐదో మహాసభలు జరిగాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర కొత్త కమిటీ ని ఎన్నుకున్నారు. కమిటీలో శశికాంత్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులు ఆయన్ను అభినందించారు.

కశ్మీర్ టు కన్యాకుమారి సైకిల్‌యాత్ర


రాజేశ్ ఖండేకర్

ఇచ్చోడ: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్‌యాత్ర చేస్తున్న రాజేశ్ ఖండేకర్ సోమవారం మండలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడారు. గత ఫిబ్రవరి 2న కశ్మీర్‌లోని లద్దాక్ నుంచి యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతీ రోజు 40 నుంచి 50 కి.మీ యాత్ర కొనసాగుతుందన్నారు. మరో రెండునెలల్లో కన్యాకుమారికి చేరుకుంటుందని అన్నారు. పైడిల్ లేని సైకిల్‌ను ప్రత్యేకంగా తయారు చేసుకుని కాళ్లతో నెట్టుకుంటూ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. గిన్నిస్ రికార్డు కోసమే యాత్ర ప్రారంభించినట్లు వివరించారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీ?

భైంసా: బాసరలోని ఓ హోటల్‌లో క్రికెట్ బుకీ నిర్వహిస్తున్న ఇద్దరిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. ఐపీఎల్ క్రికెట్ ప్రారంభం నుంచే బాసర కేంద్రంగా మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్ జోరుగా కొనసాగుతోంది. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ విషయమై దృష్టిపెట్టి ఇద్దరిని అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం.

వడదెబ్బ... తస్మాత్ జాగ్రత్త



- అత్యధికంగా నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- ప్రజల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం

మంచిర్యాలటౌన్/నిర్మల్‌చైన్‌గేట్: ఏప్రిల్ మాసంలోనే భానుడు భగ్గుమంటుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. ఇప్పడే 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే మాసంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉండడంతో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నీటిశాతం ఎక్కువగా ఉండే ఆహారం మేలు..



- నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది.
- శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- వేసవిలో ఆకలి తక్కువగానూ దాహం ఎక్కువగానూ ఉంటుంది. జీర్ణక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.


వడదెబ్బ అంటే..

ఎక్కువ ఉష్ణోగ్రతల తాకిడికి గురైతే శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడడాన్ని వడదెబ్బ అంటారు. వేడి వాతావరణం లేదా చురుకైన పనులతో కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రతలతో శరీర ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తుంది.

లక్షణాలు

వడదెబ్బ తాకిన వారి కాళ్ల వాపులు వస్తాయి. కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్రమైన జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి సత్వర వైద్యం అందించాలి.

ప్రాథమిక చికిత్స



- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తుడవాలి. వదులుగా ఉన్న నూలు దుస్తులు వే యాలి.
- ఫ్యాను గాలి లేదా చల్ల ని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించవచ్చు.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగిని సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

తేలికపాటి ఆహారం ఉత్తమం

వేసవిలో సాధ్యమైనంత వరకు నూనెతో తయారు చేసిన పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, జంక్‌ఫుడ్ వంటి వాటి జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. తేలికపాటి ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పిల్లలను బయటకు పంపించవద్దు. వేసవి వేడిని తట్టుకునేందుకు నూనెలేని, తేలికపాటి ఆహారాన్ని పిల్లలకు అందించాలి. డీఫ్రిజ్‌లో ఉంచిన వాటిని వెంటనే తినడం, తాగడం వంటివి చేయవద్దు. సాధారణ ఉష్ణోగ్రత కంటే కొంచెం చల్లగా ఉన్న వాటిని మాత్రమే తీసుకోవాలి. బాగా చల్లగా ఉన్న నీరు తాగడం వల్ల తిన్న ఆహార పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కూల్ డ్రింక్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి.



బారిన పడకుండా ఉండాలంటే...



- వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీ రు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడలో ఉండేందుకు ప్రయత్నించండి.
- గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండ సమస్యలు ఉన్నవారి శరీరాలకు అధిక సూర్యరశ్మి ప్రభావించి శరీరం త్వరగా డీ హైడ్రేషన్‌కు గురవుతుంది. దీంతో వ్యాధి తీవ్రతలు అధికంగా ఉంటాయి.
- ఆల్కహాల్, సిగరేట్, కార్బోనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్‌గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించాలి.
- వేసవిలో ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. కారం, మసాలాలు లేకుంటే ఉత్తమం.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ ద్రావణాలను తాగడం మంచిది.

రోజుకు ఎనిమిది లీటర్ల నీరు తాగాలి

వేసవిలో రోజుకు ఎనిమిది లీటర్లకు తక్కువ కాకుండా నీటిని తాగాలి. తెల్లని కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. బీపీ, షుగర్, గుండెజబ్బులు ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయడం మంచిదికాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాలంటే తలకు టోపీ, తల పాగా ధరించాలి. వడదెబ్బకు గురైనట్లు గుర్తించిన వెంటనే సమీపంలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలి.

– డాక్టర్ రత్నాకర్, జనరల్ ఫిజీషియన్, నిర్మల్

చేయకూడని పనులు

- మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో బయట ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపై విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగవద్దు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్న ఆహారం మాత్రమే తినడం మంచిది.
- ఆహారంలో మాంసాహారం తగ్గించి తాజా కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి.

జాగ్రత్తలు



ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపీ ధరించి వెళ్లాలి. కొబ్బరి నీరు, ఉప్పు, చక్కెర, నిమ్మరసం కలిపిన నీటిని తాగాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్‌ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాం. నవజాత శిశువులను పల్చటి గుడ్డతో సగం వరకు కప్పి ఉంచాలి. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, మంచిర్యాల జిల్లా వైద్యాధికారి

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్

ఉట్నూర్: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ భీంరావ్, డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి 38 అర్జీలు స్వీకరించారు. ఇందులో అటవీ హక్కుల పత్రాలు, డబుల్ బెడ్రూం, పింఛన్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు కోసం అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను ఆయా విభాగం అధికారులు పరిశీలించి సత్వరం న్యాయం చేయాలన్నారు. వేసవిలో గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- తన కుటుంబ పోషణకు ఐటీడీఏ ద్వారా ఉపాధి అవకాశం కల్పించాలని నెన్నెల మండలం జంగల్‌పేట్‌కు చెందిన శ్రీదేవి అర్జీ పెట్టుకుంది.
- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా టెంట్ హౌజ్ పెట్టుకోవడానికి రుణం అందించాలని భీంపూర్ మండలం వడూర్‌కు చెందిన ఆత్రం మోతిరాం విన్నవించాడు.
- ఉట్నూర్ మండలం చోప్పనికుంట గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని టేకం తుకారాం వేడుకున్నాడు.
- గిరి వికాసం పథకం ద్వారా తమ పంట పొలంలో బోరు ఏర్పాటు, మోటార్ మంజూరు చేయాలని గాదిగూడ మండలం అర్జునికి చెందిన మోతుబాయి అర్జీ పెట్టుకుంది.
- తనకు పింఛన్ ఇప్పించాలని జైనూర్ మండలం రాశిమెట్టుకు చెందిన జుగాదిరావ్ వేడుకున్నాడు.

ఆర్జీయూకేటీలో పుస్తకావిష్కరణ


ఆవిష్కరిస్తున్న వరిటీ డైరెక్టర్, వీసీ, అధ్యాపకులు

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ రచించిన విండ్ అండ్ సోలార్ ఎనర్జీ అప్లికేషన్స్, టెక్నాలజికల్ చాలెంజెస్ అండ్ అడ్వాన్సెస్ అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డీన్లు, హెచ్ఓడీలు, అధ్యాపకులు సమక్షంలో జరిగింది. ఈ పుస్తకంతో అంతర్జాతీయ స్థాయిలో విండ్, సోలార్ ఎనర్జీకి సంబంధించిన టెక్నాలజికల్ డెవలప్‌మెంట్, ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సతీశ్‌కుమార్ అన్నారు. వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో పలు పుస్తకాలు రచిస్తూ, ఆర్జీయూకేటీలో పరిపాలన సంబంధిత వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని సతీశ్‌కుమార్‌ను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

సౌదీలో అనారోగ్యం.. ఆస్పత్రిలో చేరి..

- ఆందోళన చెందుతున్న కుటుంబీకులు
- భారత్‌కు రప్పించాలని వేడుకోలు


లింగయ్య(ఫైల్)

భైంసాటౌన్: ఉపాధి కోసం ఒకరు సౌదీ వెళ్లి అక్కడ అనారోగ్యంతో మంచం బారిన పడ్డాడు. దీంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నా రు. వివరాలు ఇలా.. పట్టణంలోని బైల్‌బజార్‌కు చెందిన తోట లింగయ్య(47) బతుకుదెరువు కోసం సౌదీకి గతంలో ఓసారి వెళ్లిరాగా, ఈసారి ఆగస్టులో మరోమారు వెళ్లాడు. కొద్దిరోజులుగా అనారోగ్యం (పక్షవాతం)తో బాధపడుతూ అక్కడే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తోటి సిబ్బంది తమతో తెలిపినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. కాగా, అక్కడి కంపెనీ యాజమాన్యం స్పందించడం లేదని, ఎలాగైనా లింగయ్యను భారత్‌కు రప్పించాలంటూ వేడుకుంటున్నారు. మానవతావాదులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లింగయ్యను ఇంటికి రప్పించాలని కోరుతున్నారు. సాయం చేసేవారు 97016 65028, 97050 09588 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఏడురోజుల జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్. అజయ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన సురా రాజేందర్ (40), 2016 అక్టోబర్ 15న స్థానిక శాంతినగర్ ఎక్స్‌రోడ్ వద్ద అజాగ్రత్తగా కారు నడుపుతూ నిర్మల్ వైపు బైక్‌పై తన కూతురితో వస్తున్న చొప్ప కట్ల సాయిరాంను ఢీ కొట్టాడు. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై సునీల్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ 8 మంది సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

భైంసాటౌన్: బైక్ అదుపు తప్పి కిందపడి ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. తానూరు మండలం బెల్‌తరోడకు చెందిన జావిద్, కిరణ్ సోమవారం సాయంత్రం బైక్‌పై భైంసా–బాసర బైపాస్‌రోడ్ మీదుగా భైంసాకు వస్తుండగా, బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. జావిద్‌కు తీవ్ర గాయాలు కాగా, కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారమివ్వగా, వారు ఏరియాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన యువకుడు రాయినవెల్లి ప్రశాంత్(23) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్సై సమ్యద్ ముజాహిద్ కథనం ప్రకారం..ప్రశాంత్ గతకొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనిచేయకపోవడంతో ఈనెల 9న అతని తల్లి మందలించడంతో మనస్తాపం చెంది ప్రశాంత్ పురుగుల మందు తాగాడు. తల్లిదండ్రులు ఆదిలాబాద్ రిమ్స్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. తండ్రి మల్లేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్ని గ్రామంలో ఒకరు..


కుభీర్: మండలంలోని అంతర్ని గ్రామానికి చెందిన రాథోడ్ వసంత్ (36) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఎండీ షరాఫ్ కథనం ప్రకారం..వసంత్‌కు గత నాలుగేళ్లుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈనెల 15న చేనులో పురుగుల మందు తాగి పడి ఉండటాన్ని కుటుంబీకులు గమనించారు. భైంసా ఏరియా అసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. తండ్రి రాంచందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చూసినట్లు ఎస్సై తెలిపారు.

పాత నేరస్తుడి హల్‌చల్


ఆత్మహత్యాయత్నం చేస్తున్న షేక్ మోయిజ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో పాత నేరస్తుడు షేక్ మోయిజ్ సోమవారం హల్‌చల్ చేశాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట తనవెంట తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకున్నాడు. స్టేషన్‌పైకి రాళ్లు విసరడంతోపాటు ఒంటిపై బ్లేడ్‌తో గాయపర్చుకున్నాడు. పోలీసులు తనను తరచూ వేధిస్తున్నారని గట్టిగా అరుస్తూ ఆందోళనకు దిగాడు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. మోయిజ్‌ను పోలీసులు వారించే ప్రయత్నం చేశారు. తన వద్దకు వస్తే నిప్పు అంటించుకుంటానని భయభ్రాంతులకు గురిచేశాడు. నచ్చజెబుతూ వచ్చి ఆయన్ను పట్టుకుని బ్లేడ్, పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో కూర్చొబెట్టారు. కొంతసేపటి తర్వాత పరారయ్యాడు. గతంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎ దుట ఇలాగే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

వైన్స్‌లో అగ్నిప్రమాదం


దగ్ధమైన మద్యం బాటిళ్లు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బైల్‌బజార్ సమీపంలో గల లక్కీ వైన్స్‌షాపులో సోమవా రం తెల్లవారుజాము షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షాపు నుంచి పొగలు రావడంతో స్థానికులు వెంటనే అ గ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించా రు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది వైన్స్ షటర్ తలుపు తెరిచి మంటలార్పివేసి అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో మద్యం బాటిళ్లు, రాక్‌లు, ఫ్రిజ్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం


మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి అద్దంకి దయాకర్, తదితరులు

- టీపీసీసీ కార్యదర్శి అద్దంకి దయాకర్

ఇచ్చోడ: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ కార్యదర్శి అద్దంకి దయాకర్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన జై భారత్ సత్యాగ్రహ సభలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం లక్షల కోట్లు దోచుకుంటుంటే, రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం వేల కోట్లు దండుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి పథకాల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. చనిపోయే బామ్మకు పెన్షన్ ఇస్తారు కాని ఆ బామ్మను సాదుకునే మనువడికి ఉద్యోగం ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువత కోసం 2 లక్షల ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేస్తోందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, నియోజకవర్గ నాయకుడు అడె గజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ దొంగల అరెస్టు

- వాహనం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

ఇచ్చోడ: రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు జేసీబీ దొంగలను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా పాండ్రాకొడలో వారిని అదుపులో తీసుకుని, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో నరేందర్ అనే వ్యక్తికి జేసీబీ ఉంది. గత ఫిబ్రవరి 28న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌లో నెల రోజులు పని ఉందని రాజస్థాన్‌కు చెందిన సూలెమాన్, సోకియస్‌లు జేసీబీని లీజుకు తీసుకున్నారు. వారం పాటు అక్కడి ప్రాంతంలో పనిచేస్తున్నట్లు నమ్మించి జేసీబీతో సహా మహారాష్ట్రకు పరారయ్యారు. పాండ్రాకొడలో జేసీబీతో పనులు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో జేసీబీని విక్రయించే ప్రయత్నం చేశారు. లీజుకు తీసుకున్న ఇద్దరు వ్యక్తులతోపాటు జేసీబీ ఆచూకీ తెలియకపోవడంతో నరేందర్ ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ముదావత్ నైలు, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, ఎస్సై శ్రీకాంత్‌లు కేసు దర్యాప్తు చేపట్టారు. పాండ్రాకొడలో నిందితులు ఉన్నట్లు సమాచారంతో పోలీసులు అక్కడికెళ్లి వారిని పట్టుకుని, జేసీబీ స్వాధీనం చేసుకున్నారు. వారిని పట్టుకునేందుకు కృషిచేసిన సీఐ, ఎస్సైలను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో సీఐ నైలు, ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సైలు శ్రీకాంత్, సాయన్న, ఏఎస్సై చారి, రైటర్ దత్తులు పాల్గొన్నారు.